క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు


అనుపమ అంజలి

తిరుమల: శ్రీవారిని గురువారం మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

'దిశ'తో మహిళలకు రక్షణ


మాట్లాడుతున్న దిశ ఏఎస్ఐ ఎస్.గిరిజ

తిరుపతి కల్చరల్: దిశ, నిర్భయ చట్టాలతో మహిళల రక్షణ కలుగుతుందని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని దిశా ఏఎస్ఐ ఎస్.గిరిజ తెలిపారు. రాస్ కుటుంబ సలహా కేంద్రంలో గురువారం మహిళలకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలపై దాడులను నివారించేందుకు, వారికి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం దిశా చట్టాలను తీసుకువచ్చిందన్నారు. ఏ అవసరం వచ్చినా దిశా టీమ్‌ను సంప్రదించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని, విద్యార్థులు ఫేస్ బుక్, ట్విట్టర్, వాట్సాప్ యాప్‌లు వాడవద్దని సూచించారు. రాస్ కుటుంబాల సలహా కేంద్రం కౌన్సిలర్స్ సి.బాలాజిరెడ్డి, కవిత, రాస్ సిబ్బంది వనజ, లీలావతి, నాగమణి, భ్రమరాంబ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా హోమ మహోత్సవాలు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో చేపడుతున్న హోమ మహోత్సవాల్లో భాగంగా గురువారం దక్షిణామూర్తి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా యాగశాలలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, అగ్నిప్రతిష్ట, దక్షిణామూర్తి స్వామి హోమం, పూర్ణాహుతి, నివేదన, హారతి చేపట్టారు. శుక్రవారం శ్రీదుర్గ, లక్ష్మి, సరస్వతి అమ్మవార్ల హోమం, శనివారం శ్రీరుద్ర, మహామృత్యుంజయ హోమం నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, ఆలయ అర్చకులు, పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి


ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

చంద్రగిరి: ఆధార్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని (డివిజన్ డెవలప్‌మెంట్ అధికారిణి) డీఎల్‌పీఓ సుశీల తెలిపారు. ఆమె గురువారం చంద్రగిరి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని పనపాకం, చంద్రగిరి కొత్తపేట, పాతపేటలో మూడు ఆధార్ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందులో 5 ఏళ్ల దాటిన చిన్నారులు, 2016లోపు ఆధార్ తీసుకున్న వారు అప్‌డేషన్ చేయించుకోవాలన్నారు. చిరునామా, పేర్లు మార్పులు చేర్పులు, ఫోన్ నంబర్లు వంటి చేయించుకోవచ్చన్నారు. ఎంపీడీవో రమేష్ బాబు, సర్పంచ్ ముదికుప్పం రూప, సెక్రటరీ మహేశ్వరయ్య పాల్గొన్నారు.

బలరామరెడ్డి సేవలు ఆదర్శనీయం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ

తిరుచానూరు: ఎస్వీయూ అభివృద్ధికి బలరామరెడ్డి చేసిన సేవలు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. ఎస్వీయూ మాజీ సిండికేట్ సభ్యుడు మొక్కల బలరామరెడ్డి 13వ వర్ధంతిని గురువారం ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో జరుపుకున్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ బలరామరెడ్డి స్విమ్స్ పాలకవర్గ సభ్యుడిగా ఆస్పత్రి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఎస్కే మాజీ వీసీ ఆచార్య పి.కుసుమకుమారి విశ్వవిద్యాలయం అభివృద్ధి, నాడు, నేడు అంశంపై ప్రసంగించారు. సీనియర్ పాత్రికేయుడు జి.శ్రీధర్, రచయిత పెమ్మరాజు గోపాలకృష్ణ, ఎస్వీయూ పూర్వ వీసీ జయరామరెడ్డి, ఆచార్య పి.మునిరత్నంరెడ్డి, ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి, మల్లా పెంచల ప్రసాద్, మహిళా వర్సిటీ మాజీ వీసీ జమున, భూమన్, మాంగాటి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మేర్లపాక వద్ద గురువారం వాహనాన్ని తప్పించే క్రమంలో బైక్ బోల్తాపడి తిరుపతికి చెందిన సురేష్(34), మోహన్(32) గాయపడ్డారు. వారు శ్రీకాళహస్తికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ రథ సారథి సీఎం జగన్

- తిరుపతిలో 28 వేల మందికి ఇళ్లు మంజూరు
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- నెలలో తిమ్మినాయుడుపాలెం యాదవకాలనీకి తెలుగుగంగ
- డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి మంగళం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన గురువారం మేయర్ శిరీష, కార్పొరేటర్ మునిరామిరెడ్డితో కలిసి 8వ డివిజన్ సంజయ్‌గాంధీకాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారు పొందిన ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హత ఉండి పథకాలు అందని వారి వివరాలు సేకరించి పరిశీలించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరంలోని 28 వేల మంది పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చినట్టు తెలిపారు. పలు పథకాల ద్వారా ప్రతి ఇంటికీ రూ.5 లక్షల నుంచి 12 లక్షల వరకు లబ్ధి చేకూర్చినట్టు వివరించారు. ఇంత చేసిన జగనన్నకు ఎన్నిసార్లు ఓట్లు వేసి గెలిపించినా రుణం తీర్చుకోలేమన్నారు.

వలంటీర్‌కు సీఎం సహాయ నిధి

వలంటీర్ సుధారాణికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎం సహాయ నిధి అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన సుధారాణి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.


యాదవకాలనీలో పథకాలను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

యాదవకాలనీకి తెలుగు గంగ నీరు

తిరుపతి 1వ డివిజన్ తిమ్మినాయుడుపాలెంలోని యాదవకాలనీకి నెల రోజుల్లో తెలుగు గంగ నీటిని అందజేస్తామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆయన కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డితో కలిసి యాదవకాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ కాలనీకి తెలుగుగంగ నీరు రావడం లేదని స్థానికులు విన్నవించారు. స్పందించిన ఆయన నెల రోజుల్లో నీటిని సరఫరా చేమని చెప్పారు. మాస్టర్ ప్లాన్ రోడ్లను కూడా మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తామని తెలిపారు. తద్వారా నగరంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, రుయా అభివృద్ధి కమిటీ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్‌రాయల్, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, తమ్ముడు గణేష్, బోకం అనీల్‌కుమార్, హనుమంత్‌నాయక్, 7వ డివిజన్ అధ్యక్షుడు చిమట రమేష్, టౌన్ బ్యాంకు డైరెక్టర్లు కడపగుంట అమరనాథ్‌రెడ్డి, కాసీమ్(చోటాబాయ్), పోలిరెడ్డి నాగిరెడ్డి, రవిచంద్ర, మురళి, గఫూర్, తాలూరి ప్రసాద్, నాదముని, ధనశేఖర్, కంకనాల రమేష్, శారద, రాజేశ్వరి, తలారి రాజేంద్ర పాల్గొన్నారు.

యోగి వేమన భావితరానికి స్ఫూర్తిదాయకం


వేమనకు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: యోగి వేమన జీవితం, ఆయన పద్యాలు భావితరాల వారికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ విశ్వదాభిరామ వినుర వేమ మకుటంతో పామరులకు కూడా అర్థమయ్యేలా పద్యాలను ఆశువుగా చెప్పిన గొప్ప కవి వేమన అని గుర్తు చేశారు. సమాజంలోని మూఢ నమ్మకాలు, రుగ్మతలను ఎండగడుతూ వేలాది పద్యాలు అందించారని తెలిపారు. వేమనను ఐక్యరాజ్య సమితి యునెస్కో విభాగం ప్రపంచ భాషా కవుల్లో ఒకరిగా ఎంపిక చేసిందని వివరించారు. ఆయన జీవితాన్ని, కవితలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పాకాల: వేమన ఆలోచనలు అనుసరనీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.సురేంద్ర తెలిపారు. స్థానిక కళాశాలలో గురువారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఈశ్వర్‌బాబు మాట్లాడుతూ వేమన ఆనాటి సాంఘిక దురాచారాలపై ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చారని తెలిపారు. అధ్యాపకులు రమేష్‌కుమార్, చిట్టికళావతి, రాజేశ్‌కుమార్ పాల్గొన్నారు.

తిరుచానూరు: శిల్పారామంలో గురువారం యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి రుపేంద్రనాథ్‌రెడ్డి, రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్ మాట్లాడుతూ వేమన పద్యాలు వినని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి లేదన్నారు. ఆయన పద్యాల ద్వారా సరళమైన భాషలో ప్రపంచ పోకడను తెలియజేసిన సహజ కవి అని కొనియాడారు. శిల్పారామం పరిపాలనా అధికారి ఖాదర్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.

కుర్చీలు వితరణ


కుర్చీలను అందజేస్తున్న న్యాయవాదులు

తిరుపతి లీగల్: తిరుపతి సీనియర్ న్యాయవాది ఆర్.సుబ్బారావు జయంతి సందర్భంగా ఆయన జూనియర్ న్యాయవాదులు గురువారం న్యాయవాదుల సంఘానికి 30 కుర్చీలు వితరణ చేశారు. న్యాయవాదులు ఎ.మోహన్, ఎస్ఎ మోహన్, ఎస్.జాకీర్ హుస్సేన్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ న్యాయ సలహాదారు ఐ.చంద్రశేకర్‌రెడ్డి, ప్రసాద్ కుర్చీలు ఇచ్చారని తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దినకర్ తెలిపారు.

గంగమ్మ ఆలయ పనుల పరిశీలన


పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాబోవు గంగమ్మ జాతరను దృష్టిలో పెట్టుకుని నిర్ణీత సమయంలోపు పనులు పూర్తి చేయాలని సూచించారు. దేవదాయశాఖ, టీటీడీ ఇంజినీరింగ్, ఆలయ అధికారులు సమన్వయంతో పనులు చేయాలన్నారు. ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, మాజీ కౌన్సిలర్ దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, శాంతారెడ్డి, జక్కా శరత్ యాదవ్, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో మెళకువలు నేర్చుకోండి


సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎం హరిబాబు

తిరుపతి అర్బన్: డ్రైవింగ్‌లో మెళకువలు నేర్చుకోవాలని తిరుపతి అలిపిరి డిపో మేనేజర్, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ హరిబాబు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 17వ బ్యాచ్ అభ్యర్థులకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. 18వ బ్యాచ్ అభ్యర్థులకు శిక్షణ ప్రారంభించారు. 19వ బ్యాచ్‌కు ఈ నెల 20వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ట్రైనర్లు గోపాల్, నాగేశ్వరరావు, డ్రైవింగ్ స్కూల్ కోఆర్డినేటర్ రాము పాల్గొన్నారు.

వలంటీర్‌కు మెరుగైన వైద్యం


సుధారాణిని పరిశీలిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు

తిరుపతి మంగళం: తిరుపతి 8వ డివిజన్‌లో వలంటీర్‌గా పనిచేస్తూ అనారోగ్యానికి గురైన సుధారాణికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామని మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. ఆమె గురువారం ఆస్పత్రికి చేరుకుని సుధారాణికి అందుతున్న వైద్య చికిత్సలను పరిశీలించారు. అనారోగ్యానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వలంటీర్ సుధారాణి డెలివరీ సమయంలో బిడ్డ చనిపోయిందని, అదే సమయంలో ఫిట్స్ వచ్చాయని వివరించారు. మేయర్ మెడికల్ రికార్డులను పరిశీలించి మెరుగైన వైద్యం అందిస్తే కోలుకుంటుందని ధైర్యం చెప్పారు. సీఎం సహాయ నిధి అందేలా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు వలంటీర్ సుధారాణి వైద్యానికి సంబంధించిన రికార్డులను తీసుకుని సీఎం సహాయ నిధి వచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

బర్డ్‌లో మెరుగైన వైద్య సేవలకు చర్యలు


రోగులతో మాట్లాడుతున్న జేఈవో సదాభార్గవి

తిరుపతి తుడా: బర్డ్ ఆస్పత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని టీటీడీ జేఈవో సదాభార్గవి అధికారులను ఆదేశించారు. ఆమె గురువారం బర్డ్ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు అందుతున్న సదుపాయాలు, వైద్య సేవలను పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాల్లో మొక్కలు పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. అత్యవసర, జనరల్, ఎక్స్‌రే, స్కానింగ్, ఓపీ వార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కొత్త బ్లాక్‌లో కేఫ్టేరియా, పాత బ్లాక్ వద్ద ఖాళీ స్థలంలో రోగులు వారి సహాయకుల కోసం క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జేఈవో మాట్లాడుతూ రోగులకు అత్యాధునిక వైద్యం అందించడంతో పాటు సౌకర్యాలను కల్పనకు టీటీడీ కృషి చేస్తోందన్నారు. కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్టు చెప్పారు. ఆస్పత్రి ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ కిషోర్, ఈఈ కృష్ణారెడ్డి, డీఈ సరస్వతి పాల్గొన్నారు.

మహేష్ బాబుకు డాక్టరేట్



తిరుచానూరు: ఎస్వీయూ ఎకనామిక్స్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి తంబేరి మహేష్ బాబుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి దామ్లానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఆర్థికశాస్త్ర విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.చిన్నస్వామి నాయుడు పర్యవేక్షణలో ఇన్‌కం సేవింగ్ అండ్ ఇన్వెస్టిమెంట్ ఆఫ్ హౌస్ హోల్డ్ సెక్టార్ : ఏ కేస్ స్టడీ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన చేశారని పేర్కొన్నారు.

రేపటి నుంచి పుస్తక ప్రదర్శన

తిరుపతి కల్చరల్: ఇస్కాన్ రోడ్డులోని వినాయకనగర్ క్రీడా మైదానంలో శనివారం నుంచి 29వ తేదీ వరకు 15వ పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు భారతీయ విద్యాభవన్ గౌరవ సంచాలకుడు ఎన్.సత్యనారాయణరాజు తెలిపారు. ఆయన గురువారం ప్రెస్‌క్లబ్‌లో పుస్తక ప్రదర్శన పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పుస్తక ప్రదర్శనలో టీటీడీ, భవన్స్, అరబిందో సొసైటీ, సైన్స్ వర్సిటీ, ఎమెస్కో, వివేకానంద, విజయవాణి ప్రింటర్స్, మహాగీత మ్యూజిక్, మనోరమ, ఎంఎస్ బుక్స్, సుప్రీం లా హౌస్, నేషనల్ బుక్ ట్రస్ట్, చిల్డ్రన్స్ బుక్స్, న్యూ బుక్ లింక్స్ తదితర సంస్థలకు చెందిన సుమారు 64 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ అవసరమయ్యే విజ్ఞాన, వినోద, వైవిధ్య పుస్తకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ, ఆదికవి నన్నయ్య, అన్నమయ్య వేదికల్లో ఆధ్యాత్మిక, సాహిత్య, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే ప్రసంగాలు ఉంటాయన్నారు. భారతీయ విద్యాభవన్ కార్యదర్శి ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, టీటీడీ రిటైర్డ్ ఈఈ వెంకటేశ్వర్లు, సభ్యుడు దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

పశువుల పండుగపై పోలీసుల ఆంక్షలు


గ్రామంలో పహారా కాస్తున్న పోలీసులు

చంద్రగిరి: మండలంలోని చిన్నరామాపురంలో పశువుల పండుగను నిర్వహించకుండా పోలీసులు అడ్డుకున్నారు. రెండు రోజులుగా గ్రామంలో పహారా కాస్తున్నారు. దీనిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరతరాల నుంచి సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో పశువుల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో రెండు రోజులకు ముందు పశువుల పందేలు నిర్వహించేందుకు గ్రామస్తులు సిద్ధం చేస్తుండగా సమాచారం తెలుసుకున్న సీఐ ఓబులేశు తన సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్తులు పశువుల పందేలు నిర్వహించకుండా అడ్డుకున్నారు. బుధ, గురువారాల్లో ప్రత్యేక బృందంతో గ్రామంలోనే తిష్ట వేశారు. ఎట్టి పరిస్థితుల్లో పందేలను ప్రోత్సహించమని స్పష్టం చేశారు. ఆంక్షలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంప్రదాయ పండుగను అడ్డుకోవడం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఆదివారం పండుగ నిర్వహించి తీరుతామని వారు స్పష్టం చేస్తున్నారు.

47 మంది దుకాణదారులపై కేసులు


దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

తిరుపతి క్రైమ్ : ప్రయాణికులను మోసం చేస్తూ అధిక ధరలకు వస్తువులను విక్రయిస్తున్న ఆర్టీసీ బస్టాండ్‌లోని 47 మంది దుకాణదారులపై కేసులు నమోదు చేసినట్టు విజిలెన్స్ అండ్ ఫోర్స్‌మెంట్ జిల్లా అధికారి ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అండ్ ఫోర్స్‌మెంట్ డీఎస్పీ మల్లేశ్వర్‌రెడ్డి, సీఐలు వెంకటరవి, మల్లికార్జునరావు, రెడ్డిశేఖర్‌రెడ్డి తదితరులు ఆర్టీసీ బస్టాండ్‌లోని దుకాణాలపై దాడులు చేసినట్టు తెలిపారు. కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిళ్లతోపాటు అనేక వస్తువులను అధిక ధరకు అమ్ముతున్నట్టు గుర్తించామన్నారు. ఈ క్రమంలో 47 మందిపై కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు. ఇకపై ఇలాంటి మోసాలకు పాల్పడకుండా దుకాణాల వద్ద విజిలెన్స్ అధికారుల ఫోన్ నంబర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. డీఈ నాగసురేష్, డీసీటీవో చెన్నారెడ్డి, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో క్రికెట్ క్రీడాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు బి.విజయకుమార్

తిరుపతి కల్చరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించడంతోపాటు క్రికెట్ క్రీడను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.విజయకుమార్ తెలిపారు. ఆయన గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. క్రికెట్ ఆటపై తనకున్న మక్కువతో పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు అనేక జట్లకు కెప్టెన్‌గా పనిచేశానని తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లో కొందరు నిధుల దుర్వినియోగానికి పాల్పడినందుకు ప్రశ్నించడంతో తనపై 2007 నుంచి 2016 వరకు నిషేధం విధించారని తెలిపారు. దీనిపై తాను 17 ఏళ్లు న్యాయ పోరాటం చేసి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ తిరిగి సాధించుకున్నామని తెలిపారు. తమ అసోసియేషన్ పూర్తి స్థాయిలో పనిచేస్తూ క్రికెట్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తుందని వివరించారు. అలాగే తిరుపతిలో అత్యాధునిక వసతులతో క్రీడా మైదానాన్ని నెలకొల్పడానికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌తో పోరాడతామన్నారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షులు శ్రీధర్ కుమార్, శ్రీనివాసమూర్తి, సహాయ కార్యదర్శి వై.మురళియాదవ్, కోశాధికారి సి.గిరిప్రకాష్, సభ్యులు ప్రకాష్ నాయుడు, సతీష్ యాదవ్, రమణ, హరిప్రసాద్, శివప్రసాద్, మార్కండేయులు పాల్గొన్నారు.

సత్తా చాటిన తిరుపతి కోడి

పళ్లిపట్టు: ఆర్కేపేటలో నిర్వహించిన కోడి పెందేల్లో తిరుపతికి చెందిన విజయ్ కోడి తొలిస్థానంలో నిలిచింది. అతనికి నిర్వాహకులు గురువారం ట్రోఫీ, సర్టిఫికెట్ అందజేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పళ్లిపట్టు సమీపంలోని ఆర్కేపేట విలక్కనాంపూడి పుదూర్‌లో మద్రాస్ హైకోర్టు ప్రత్యేక అనుమతితో కోడి పందేలు నిర్వహించారు. ఇందులో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 386 కోళ్లు పోటీ పడ్డాయి. ఈ నేపథ్యంలో తిరుపతి నామాలవారి పార్టీకి చెందిన విజయ్ కోడి విజయం సాధించింది. అతనికి సీఐ సర్టిఫికెట్, ట్రోఫీ అందజేసి అభినందించారు.

రోడ్డు పనుల అడ్డగింతపై ఫిర్యాదు


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగపల్లె వాసులు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ మాదిగపల్లెకు వేస్తున్న రోడ్డు నిర్మాణ పనుల ను అడ్డుకున్న అగ్రకులస్తులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గురుశంకర్ ప్రసాద్ మాదిగ తెలిపారు. ఆయన గురువారం తహసీల్దార్, భాకరాపేట ఎస్ఐకి ఫిర్యాదుచేశారు. ఆయన మాట్లాడుతూ మాదిగపల్లె ప్రజలు చిన్నగొట్టిగల్లుకు రావాలన్నా, పిల్లలు చినిగేపల్లె పాఠశాలకు వెళ్లాలన్నా చెరువుకట్ట, బండిబాటే శరణ్యమన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు తుడా నిధులతో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్టు తెలిపారు. అగ్రకులస్తులు పనులను అడ్డుకోవడమే కాకుండా మాదిగలను కులం పేరుతో దూషించారని తెలిపారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ


మాట్లాడుతున్న రవాణాశాఖ అధికారులు

తిరుపతి మంగళం: వాహనాలు నడిపేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవడం, హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలకు రక్షణ కలుగుతుందని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావ్, కుసుమ తెలిపారు. వారు గురువారం మంగళంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో వాహన డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిర్లక్ష్యం కారణంగా పలువురు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, సీటు బెల్ట్ పెట్టుకోవాలని, అతి వేగం వద్దని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని పదే పదే చెబుతున్నా డ్రైవర్లు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. రవాణాశాఖ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను పూర్తిగా తగ్గించవచ్చునని తెలిపారు. మంగళం రోడ్డులో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, కళాశాల విద్యార్థులతో పాటు బస్సులు, ఆటోలు 40 కిలో మీటర్ల వేగానికి మించి వెళ్లరాదని హెచ్చరించారు. ఇప్పటికైనా వాహనదారులు నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని చేతులెత్తి దండం పెట్టి విజ్ఞప్తి చేశారు.

29 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 29 మందికి రూ.25 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి గురువారం తీర్పు చెప్పారు. నిందితులను తిరుపతి ట్రాఫిక్ పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.